సాక్షి
అనకాపల్లి
శనివారం ı 24 ı ఫిబ్రవరి ı 2024



జాతీయ పురస్కారం

విశాఖ: ఏయూ ఓఎస్‌డీ కృష్ణమోహన్‌ను హిందుస్థాన్ టైమ్స్ సంస్థ టాప్-10 ప్రొఫెసర్స్ జాతీయ పురస్కారంతో సత్కరించింది.



అందాల పట్టణంగా అనకాపల్లి

అనకాపల్లి రూరల్, పట్టణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో నిర్మించిన పలు పథకాలను మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 32.5, కనిష్టంగా 24.4 డిగ్రీలు, తేమ 74 నుంచి 76 శాతం నమోదవుతాయని, గాలి గంటకు 10 నుంచి 12 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

నేడు విశాఖకు వైవీ సుబ్బారెడ్డి

- ఎయిర్‌పోర్టులో స్వాగతం పలకనున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సాక్షి, విశాఖపట్నం/మునగపాక: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డి శనివారం విశాఖకు రానున్నారు. ఉదయం 10 గంటలకు ఎయిర్‌పోర్టులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడ నుంచి వందలాది బైక్‌లు, కార్లతో ర్యాలీగా బయలుదేరి ఎన్‌ఏడీ జంక్షన్, బిర్లా జంక్షన్, తాటిచెట్లపాలెం, సత్యం జంక్షన్, ఎంవీపీ కాలనీ డబుల్‌రోడ్డు జంక్షన్ మీదుగా ఎండాడలోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. సుబ్బారెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.

ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్



ఉద్యోగి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: జిల్లాలో పోలీస్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న పోలీస్ గ్రీవెన్స్ శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జరిగింది. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై వినతులు అందినట్టు చెప్పారు. తమ పరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

దూరవిద్య ప్రవేశాల నోటిఫికేషన్ రేపు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) విధానంలో నిర్వహించే 38 కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ ఆదివారం జారీ చేస్తున్నట్లు దూరవిద్య సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ నెల 26 నుంచి వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు www.andhra university& sde.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. మొత్తం 17 యూజీ కోర్సుల్లో, 21 పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తారు. ఆసక్తి, అర్హత కలిగినవారు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు

అనకాపల్లి: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జరిగే గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్, రాత పరీక్షకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 33 పరీక్ష కేంద్రాల్లో 10,627 మంది పరీక్షకు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. అనకాపల్లి, చోడవరం, మాకవరపాలెం, నర్సీపట్నం మండలాల్లో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం పోలీస్ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు.

నేడు బలిఘట్టంలో గిరి ప్రదక్షిణ



ఏర్పాట్ల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: భక్తులు ఆరాధ్య దైవంగా పూజించే బలిఘట్టం శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ శనివారం జరిగే గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను ఎమ్మెల్యే శుక్రవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించిందన్నారు. రెండు కిలోమీటర్ల మేర ప్రదక్షిణ ఉంటుందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణకు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారన్నారు. ఆలయ చైర్మన్ శెట్టి చిన్న, మాజీ కౌన్సిలర్ గవిరెడ్డి స్వామినాయుడు, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజకు భరోసా



ధాన్యం గాలిపోత చేస్తున్న రైతులు



రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు

- దళారుల చేతిలో మోసపోకుండా చర్యలు
- మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం
- ఇంతవరకు 16,269 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు
- 4,805 మంది రైతుల ఖాతాల్లో రూ.15.55 కోట్ల జమ
- జిల్లాలో హమాలీలకు కూలి సొమ్ము రూ.15.55 లక్షల చెల్లింపులు
- ధాన్యం రవాణా చేసేందుకు 475 ట్రాక్టర్లు జీపీఎస్ విధానంతో ఏర్పాటు

నాతవరం: ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తరుగు, కోత బెడద లేకుండా రైతుల నుంచి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. దళారుల చేతిలో మోసపోకుండా మద్దతు ధరకు సేకరిస్తోంది. గతేడాది జిల్లాలో 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఈ ఏడాది కూడా ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయడమే ధ్యేయంగా పెట్టుకుంది. ఇంతవరకు జిల్లాలో 16, 269 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. 21 రోజుల్లోనే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఇంతవరకు 4,805 మంది రైతులకు రూ.15.55 కోట్లు చెల్లింపులు చేసింది. మిగతా సొమ్ము దశల వారీగా జమ చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

343 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు

జిల్లాలోని 24 మండలాల్లో రైతులు పండించిన ధాన్యం నేరుగా కొనుగోలు చేసేందుకు 72 క్లస్టర్ల పరిధిలో 343 కేంద్రాలు ఏర్పాటు చేసింది. వాటిలో 54 కేంద్రాలు పీఏసీఎస్‌లు. మిగతావి ఆర్బీకేల ద్వారా కొనుగోళ్లు చేస్తున్నారు. రైతుకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు కావలసిన సామగ్రి, గోనె సంచులు, కూలీలు చార్జీలు, రవాణా ఖర్చులు కలిపి ప్రభుత్వమే భరిస్తోంది. కల్లాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు జిల్లా వ్యాప్తంగా జీపీఎస్ అనుసంధానం చేసిన 475 ట్రాక్టర్లను జాయింట్ కలెక్టరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రైతుల వద్ద అధికారులు కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు 21 రైస్ మిల్లర్లకు అనుమతులు ఇచ్చారు. ఆయా రైస్ మిల్లర్ల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు, మోసాలు లేకుండా చేసేందుకు వ్యవసాయ శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లయి సిబ్బందిని పర్యవేక్షణకు నియమించారు.

రవాణా చార్జీలకు రూ.26 లక్షలు, గోనె సంచులకు రూ.4.5 లక్షలు, హమాలీలు (కూలీలకు) రూ.15 లక్షల 55 వేలు చెల్లింపులు చేశారు. ట్రాక్టర్లు రవాణా చార్జీలు కింద రూ.26 లక్షలు నేరుగా అకౌంట్లలో జమ చేశారు. ఈ ఏడాది ధాన్యం మద్దతుధర వంద కేజీల బస్తా గ్రేడ్ ఏ రకం రూ.2,203, సాధారణ రకం రూ.2183గా ప్రభుత్వం నిర్ణయించింది..

వడివడిగా నూర్పులు

జిల్లాలోని పలు మండలాల్లో ఖరీఫ్ వరి చేను కోసి పొలాల్లో కుప్పలుగా ఏర్పాటు చేసుకున్నారు. పొలాల్లో రైతులు వేసుకున్న ఆరుతడి పంటలైన మినప, పెసర, జనుము తదితర పంటలు ప్రస్తుతం పంట దశలో ఉన్నాయి. వీటి పంట తీసుకున్న తర్వాత పొలాల్లో వేసుకున్న వరి కుప్పలు నూర్పిడి చేస్తారు. అందువల్ల ఈ నెలాఖరు నుంచి వచ్చే నెలలో ముమ్మరంగా నూర్పిడి చేసి ధాన్యం విక్రయిస్తుంటారు. మరికొన్ని మండలాల్లో ఇప్పటికే వరినూర్పులు పూర్తయ్యాయి.

ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

రైతులు నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి గడువు విధించలేదు. వచ్చే నెలలోనూ కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని మించి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు రీత్యా పంట దిగుబడి తగ్గింది. అందువల్ల ఆర్జీఎల్ రకం రేటు మేము ఇచ్చే దాని కంటే బయట మార్కెట్లో ఎక్కువగా ఉంది. జిల్లాలో నాతవరం, బుచ్చెయ్యపేట, చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, రోలుగుంట, మునగపాక మండలాల్లో అధికంగా ఆర్జీఎల్ రకం పండించారు. ప్రభుత్వ ధరకు ఆర్జీఎల్ రకం కొనుగోలు చేస్తాం.

– పి.జయంతి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్, అనకాపల్లి

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గొల్ల బాబూరావు. చిత్రంలో పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు, కోలా గురువులు, కె.కె రాజు

- దళితుడినైన నన్ను రాజ్యసభ సభ్యుడ్ని చేశారు : గొల్ల బాబూరావు
- విమానాశ్రయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఘన స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో గొల్ల బాబూరావును పూలమాలలతో ముంచెత్తిన అభిమానులు

గోపాలపట్నం/బీచ్‌రోడ్డు (విశాఖ): దళితుడినైన తనకు రాజకీయంగా మహానేత వైఎస్సార్ అవకాశం కల్పిస్తే.. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తమ భవిష్యత్తు కల్పించారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కొనియాడారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తొలిసారిగా విశాఖ వచ్చిన ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. ఎయిర్‌పోర్టు నుంచి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు పీవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో బైక్‌లు, కార్లతో ర్యాలీగా డాబాగార్డెన్స్ సర్కిల్‌కు చేరుకుని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ ఒక దళితుడికి రాజ్యసభ సీటు ఇవ్వడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఈ సీటు బాబురావుకు కాదు దళితులందరికీ దక్కిన గౌరవమన్నారు. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. రాజ్యసభ సీటు పేరు చెప్పి వర్ల రామయ్యను చంద్రబాబు మోసం చేశారన్నారు. దళితుడికి ఇవ్వాల్సిన రాజ్యసభ సీటును తన సామాజిక వర్గానికి చెందిన నేతకు ఇచ్చి దగా చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. రాజ్యసభ సీట్లను వందల కోట్లకు అమ్ముకున్న చరిత్ర ఆయనదని విమర్శించారు. సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమవుతోందని మరోమారు రుజువైందన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల అభినందనలు

రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన గొల్ల బాబూరావును వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, నియోజకవర్గ పరిశీలకులు చిక్కాల రామారావు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కె.హనోక్, కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు బాబూరావుకు అభినందనలు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు



నోడల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు
- వికలాంగులు, వృద్ధులకు ర్యాంపులు
- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై నోడల్ అధికారులు, ఈఆర్వో, ఏఈఆర్వోలతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లో ఏ చిన్న పొరపాటు దొర్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. వికలాంగులు, వృద్ధులకు ర్యాంపులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో మోడల్ (నమూనా) పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానం, తమ ఓటు ఎక్కడ ఉందో తెలుసుకునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. సీప్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. నోడల్ అధికారులు వారి విభాగాలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు పక్కాగా ఉండేలా ప్రణాళికాయుతంగా పనులు చేపట్టాలన్నారు.

అంతకుముందు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఎం.కె.మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, అధికారులు పాల్గొని, జిల్లాలోని ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల గురించి, ఎన్నికల ముందస్తు ఏర్పాట్ల గురించి తెలియజేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, సీప్ కార్యక్రమ నిర్వహణ, అవగాహన కార్యక్రమాలు గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో చిన్నికృష్ణ, నోడల్ అధికారులు డ్వామా పీడీ ఇ.సందీప్, ఆర్ అండ్ బీ ఈఈ రమేష్, మత్స్యశాఖ డీడీ ప్రసాదరావు, ఏపీ ఎంఐపీ పీడీ కె.వి.లక్ష్మి, డీఎస్వో కె.వి.ఎల్.ఎన్.మూర్తి, పౌర సరఫరాల డీఎం జయంతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, డీసీవో కిరణ్‌కుమారి, అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు సత్యవాణి, కె.మనోరమ, కె.గీతాంజలి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమికి సర్వం సిద్ధం



రేవుపోలవరంలో సముద్ర స్నానాలు ఆచరించే ప్రాంతం



మెరైన్ పోలీసులకు బందోబస్తు వివరిస్తున్న సీఐ రమేష్‌కుమార్

ఎస్.రాయవరం/పాయకరావుపేట/అచ్యుతాపురం: మాఘ పౌర్ణమి జాతర స్నానాల కోసం జిల్లాలోని తీర ప్రాంతాలను అధికారులు సిద్ధం చేశారు. రేవుపోలవరం, పూడిమడక, పెంటకోట, వాడపాలెం సముద్ర తీరాల్లో శనివారం వేకువజామున లక్షలాదిమంది పుణ్య స్నానాలు ఆచరించనుండడంతో పోలీసులు పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేశారు. రేవుపోలవరం తీరంలో నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో నక్కపల్లి సీఐ అప్పన్న పర్యవేక్షణలో 150 పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ముగ్గురు సీఐలు, అయిదుగురు ఎస్ఐలు అందుబాటులో ఉంటున్నట్టు ఎస్ఐ వీభీషణరావు తెలిపారు. నర్సీపట్నం డిపో నుంచి 35 బస్సులు అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం వరకు నడుపుతున్నట్టు చెప్పారు. ప్రయివేటు వాహనాలు అడ్డురోడ్డు జంక్షన్‌లో నిలిపివేస్తున్నట్టు చెప్పారు. స్వంత వాహనాలు, ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సముద్ర స్నానాలు చేసే ప్రదేశంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. వస్త్రాలు మార్చుకునేందుకు తాత్కాలిక మరుగుదొడ్లు స్థానిక పంచాయతీ సిబ్బంది ఏర్పాటు చేశారు. తీరం పరిధిలో తాత్కాలిక కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. పెంటకోట తీరంలో మెరైన్ పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్టు మెరైన్ సీఐ డి.వి.జె.రమేష్ కుమార్ తెలిపారు. నక్కపల్లి రూరల్ సీఐ కె.అప్పన్న, నక్కపల్లి ఎస్‌హెచ్‌వో సీఐ ఎ.విజయ్ కుమార్, పాయకరావుపేట ఎస్‌హెచ్‌ఓ సీఐ పి.అప్పలరాజు, ఎస్.రాయవరం ఎస్ఐ ఎ.విభీషణరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూడిమడకలో జాగరణ ప్రారంభం

పూడిమడక మాఘపౌర్ణమి జాగరణ శుక్రవారం సాయంత్రం ప్రారంభం అయ్యింది. సముద్ర తీరాన్ని ఆనుకొని భారీ స్థాయిలో దుకాణాలు వెలిశాయి. తినుబండారాలతో పాటు, గృహోపకరణాలు, పిల్లల ఆట వస్తువులు, ఇతర సామగ్రి దుకాణాలతో జాతర కిక్కిరిసిపోయింది. తీరం వద్ద భక్తుల స్నానాలకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేశారు. సీఐ బుచ్చిరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ సెట్టింగ్‌లతో పూడిమడక గ్రామం వీధులు ధగధగలాడుతున్నాయి.

హత్య కేసులో ఒకరికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్/రోలుగుంట: ఓ వివాదంలో ఒకరిని హత్య చేసిన నిందితుడికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ.. విశాఖలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.గోవర్ధన్ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.దేవానంద్ అందించిన వివరాలివి.. నిందితుడు అద్దేపల్లి అప్పారావు(50) ఉమ్మడి విశాఖ జిల్లా రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామ నివాసి. వృత్తి రీత్యా కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. మృతుడు మంత్రి సత్తిబాబు కూడా అదే ప్రాంతానికి చెందిన వాడు. తన భార్యతో సత్తిబాబుకు వివాహేతర సంబంధం ఉన్నట్లు అప్పారావు అనుమానించాడు. దీంతో వీరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 2017 మే 21న సత్తిబాబు, అప్పారావుల మధ్య గొడవ జరగ్గా.. సత్తిబాబును ఇటుకలతో అప్పారావు కొట్టాడు. తీవ్ర గాయాల మధ్య ఉన్న సత్తిబాబుని స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు.

రోలుగుంట పోలీసులు అప్పారావుపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పినట్టు రోలుగుంట ఎస్సై ఎల్.సురేష్ తెలిపారు.

చేరువలో ఉన్నత విద్య..!

- ప్రతీ మండలంలో రెండు జూనియర్ కళాశాలలు
- విశాఖలో 3, అనకాపల్లిలో 3, అల్లూరి జిల్లాలో రెండు..
- రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లకు ఉద్యోగోన్నతులు



కాలేజీగా మారనున్న విశాఖలోని కురుపాం జీవీఎంసీ ఉన్నత పాఠశాల

విశాఖ విద్య: పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కళాశాలలు అందుబాటులో ఉండేలా, ఇందులో ఒకటి బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అవసరమైన చోట్ల దశల వారీగా కొత్త కళాశాలల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్తగా ఎనిమిది జూనియర్ కాలేజీలు మంజూరు చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో జూన్ 1 నుంచి కాలేజీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హైస్కూళ్లలో పనిచేసే క్వాలిఫైడ్ ఉపాధ్యాయులను కొత్త కాలేజీల్లో సబ్జెక్టు అధ్యాపకులుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. వీరికి ఒక ఇంక్రిమెంట్ ఇవ్వనున్నారు.

జిల్లాల వారీగా..

- విశాఖ జిల్లాలో గోపాలపట్నం మండలం వెంకటాపురం, మహారాణిపేట మండలం జీవీఎంసీ ఎంపీడీఎంహెచ్‌ఎస్ కురుపాం మార్కెట్, పద్మనాభం మండలం రెడ్డిపల్లి అగ్రహారంలో జూనియర్ కాలేజీలు మంజూరయ్యాయి.
- అనకాపల్లి జిల్లాలో అచ్యుతాపురం, నాతవరం, ఎస్. రాయవరం మండలం కొరుప్రోలు,
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు, పెదబయలు మండలం సీతగుంటలో కాలేజీలను మంజూరు చేశారు.

ప్లస్-2 స్కూళ్లుగా గుర్తించే వీటిని పాఠశాలల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతీ చోటా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రతీ గ్రూపులో 40 మంది చొప్పున విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని ఆదేశించారు.

పట్టించుకోని గత టీడీపీ ప్రభుత్వం

కొత్తగా జూనియర్ కళాశాల మంజూరు కోసం గతంలో అయితే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. అందుబాటులో కళాశాలలు లేక, గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది విద్యార్థినులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఉండేవి. దీన్ని గుర్తించిన దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకేసారి ఏకంగా 34 కస్తూర్బా గాంధీ విద్యాలయాలను మంజూరు చేశారు. ఆ తరువాత వచ్చిన పాలకులెవ్వరూ కొత్త విద్యాసంస్థల మంజూరుకు శ్రద్ధ తీసుకోలేదు. మళ్లీ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే కొత్తగా జూనియర్ కాలేజీలు ఏర్పాటవుతుండటం గమనార్హం. వీటితో కలిపి ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 18 కాలేజీలు మంజూరయ్యాయి.

క్లుప్తంగా

ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు

ఏయూక్యాంపస్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఏ.మల్లికార్జున పరిశీలించారు. వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో భాగంగా మార్చి 1న ప్రధాని విశాఖ వస్తున్న నేపథ్యంలో ఏయూ వేదికగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ కె.ఎస్ విశ్వనాథన్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారులతో కలిసి ఏయూ మైదానాన్ని శుక్రవారం సందర్శించారు. ప్రధాని వస్తున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఉన్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రాజీవ్ గోయల్, అభిషేక్ త్రివేది, సురేంద్ర గుప్త, సీజీఎం(హెచ్ఆర్) కిరణ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు

చోడవరం: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తామని చోడవరం సహాయ కార్మికశాఖాధికారి పి.సూర్యనారాయణ శుక్రవారం హెచ్చరించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న షాపుల యజమానులపై కేసులు పెట్టి వారికి ఆయా షాపుల ద్వారా జీత వ్యత్యాసం కింద రూ.48 వేల 393 చెల్లించినట్టు ఆయన చెప్పారు. చోడవరం డివిజన్ పరిధిలో వివిధ షాపుల్లో పనిచేస్తున్న 8 మంది బాలకార్మికులకు ఈ సొమ్ము చెక్కు రూపంలో చెల్లించడం జరిగిందన్నారు. 18 సంవత్సరాలు నిండని వారిని పనిలో పెట్టుకుంటే వారిపై బాలకార్మిక చట్టాన్ని అమలు చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

అందాల పట్టణంగా అనకాపల్లి...

- మండలంలో రూ.8.80 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

తుమ్మపాల : జిల్లా కేంద్రమైన అనకాపల్లిని అందాల నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణాన్ని విశాఖ నగరానికి దీటుగా అభివృద్ధి చేశామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలో 82, 83 వార్డులలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మలసాల భరత్‌కుమార్ ప్రారంభించారు. కొత్తూరులో రూ.88.86 లక్షలతో కోల్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన చేశారు.పట్టణంలో రూ.257.60 లక్షలతో చేపట్టిన రోడ్డు విస్తరణ సెంట్రల్ మీడియం పనులను ప్రారంభించారు. మిరియాల కాలనీలో రూ.38 లక్షలతో నిర్మించిన కల్వర్ట్, ఎన్టీఆర్ స్టేడియంలో రూ.49.82 లక్షలతో నిర్మించనున్న వ్యాయామ కళాశాలకు శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ మహిళా క్రీడాకారుల ప్రాంగణాన్ని ప్రారంభించారు. 82 వార్డులో రూ.72.63 లక్షలతో అభివృద్ధి చేసిన ఓపెన్ ఎయిర్ యాంఫీ థియేటర్, పిల్లల పార్కును ప్రారంభించారు. మొత్తం రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశామన్నారు. కార్యక్రమంలో 82,83 వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల రమేష్, జెడ్పీ అప్పలనాయుడు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయానికి ప్రారంభోత్సవం

అనకాపల్లి : మేజర్ పంచాయతీ అయిన కొత్తూరు గ్రామంలో పంచాయతీ ఆవరణలో 8 సెంట్ల స్థలంలో రూ.89 లక్షలతో నిర్మించనున్న డిజిటల్ గ్రంథాలయ భవనానికి గ్రంథాలయాల చైర్మన్ కొండా రాజీవ్‌తో కలిసి మంత్రి అమర్‌నాథ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి రెండు నేత్రాలుగా భావించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో పని చేశారని పేర్కొన్నారు. కొండా రాజీవ్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో డిజిటల్ యుగాన్ని తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

సచివాలయాలతో పల్లెల్లో ప్రగతి

గ్రామసచివాలయాల వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో పూర్తి చేసిన గ్రామ సచివాలయాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మలసాల భరత్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా సీఎం .జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని, ప్రతి పల్లెలో ప్రజలకు చేరువగా పాలనా వ్యవస్థను తీసుకొచ్చారని అన్నారు.

ప్రతి గ్రామంలో సుమారు రూ.కోటి రూపాయలతో సచివాలయ భవనాలను నిర్మించామన్నారు. రోడ్లు, డ్రైనేజీల అంగన్‌వాడీ కేంద్రాలను కూడా నిర్మించడం జరిగిందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరి ఆశీర్వాదాలు ఉండాలన్నారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం, కోడూరు, సీహెచ్ఎన్ అగ్రహారం, మార్టూరు, తుమ్మపాల సచివాలయ భవనాలను ప్రారంభించారు. తుమ్మపాల, సీతానగరం, ఏఎంఏఎల్ కళాశాల వరకు రూ.4 కోట్ల బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కోడూరు, మార్టూరు, బవులువాడ, సంపతిపురం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లతో పాటు సీహెచ్ఎన్ అగ్రహారం పూర్తి చేసిన ప్రాథమిక పశు ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మాకవరం ప్రధాన రహదారికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఐఎల్‌డబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ ప్రెసిడెంట్ పి.గోవింద్, సర్పంచ్, ఎంపీటీసీలు శానాపతి లక్ష్మి, కొల్లిమల్ల గోవిందరావు, కరణం రెవెన్యూనాయుడు, మజ్జి వెంకట అప్పారావు, పెంటయ్యనాయుడు, నారపిన్ని ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం సచివాలయానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ఎన్టీఆర్ గ్రౌండ్‌లో డార్మెటరీ నిర్మాణానికి శిలఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్



మార్టూరు రైతు భరోసా కేంద్రం వద్ద సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మంత్రి అమర్‌నాథ్, భరత్‌కుమార్



డిజిటల్ గ్రంథాలయ భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న గుడివాడ అమర్‌నాథ్



శాంతి పార్కును ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

నదిలో బోల్తా పడిన టిప్పర్



నారాయణపురంలో నదిలో పడిన టిప్పర్

రాంబిల్లి : నారాయణపురం వద్ద శారద నదిలో టిప్పర్ బోల్తా పడింది. శుక్రవారం తెల్లవారుజామున అచ్యుతాపురం నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి నదిలో బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. కాగా దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు చర్యలు



జేసీ ఎం.జాహ్నవి

తుమ్మపాల : జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు అనువైన స్థలాలను వేగంగా కేటాయించాలని జాయింట్ కలెక్టర్ ఎం .జాహ్నవి అన్ని మండలాల తహసీల్దార్లకు ఆదేశించారు. ఈ నెల 22 రాత్రి ఆర్డీవోలు, తహసీల్దార్లతో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ఆమె వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలకు అందుబాటులో ఉండే విధంగా ఆయా మండల కేంద్రాలకు దగ్గరగా ఉండే స్థలాలను పరిశీలించాలన్నారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌లో ప్రాథమిక స్థాయి పరిశీలనలో గుర్తించిన 281 మంది జర్నలిస్టులకు మండలాల వారీగా వారికి అవసరమైన భూమిని గుర్తించడం, పనులు వేగవంతం చేయాలన్నారు. అనకాపల్లిలో జర్నలిస్టులు సూచించిన భూమిని పరిశీలించడం జరిగిందని కానీ అది వాగు పోరంబోకు అని ఆర్డీఓ చిన్నికృష్ణ తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం హెడ్ క్వార్టర్‌లోనే ఎక్కువ మందికి స్థలాలు ఇవ్వవలసి ఉన్నందున వాటిని త్వరగా ఫైనల్ చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు.

రేపు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా కార్యవర్గం సమావేశం

కె.కోటపాడు : అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యవర్గం సమావేశం ఈ నెల 25న దేవరాపల్లి మండలం తారువలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ తెలిపారు. ఈ వివరాలను శుక్రవారం ఆమె వివరించారు. వైఎస్సార్ ఆడిటోరియంలో ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ హాజరుకానున్నట్లు అనురాధ తెలిపారు. సమావేశానికి తప్పనిసరిగా జిల్లా మహిళా విభాగం కార్యవర్గం సభ్యులు హాజరుకావాలని అనురాధ కోరారు.

మల్లాంలో 100 మంది టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక



మల్లాం గ్రామస్తులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : మండలంలోని శివారు పంచాయతీ మల్లాం గ్రామానికి చెందిన టీడీపీ,జనసేన పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు తమ పార్టీలకు రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ బర్ల శివ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో శుక్రవారం వీరంతా తమ కుటుంబ సభ్యులు 100 మందితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు జోగా అప్పలనాయుడు, కొలాని గణేష్, రాజునాయుడు, గొలగాని హరి, కొటియ శివ, బంగారపు సాంబశివ తదితరులు తమ కుటుంబ సభ్యులతో పార్టీ మారగా వీరందరికీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ వైఎస్సార్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు జోగా కొండబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాని, వడ్డాది టౌన్ అధ్యక్షుడు నారాయణమూర్తి నాయకులు కోరుకొండ అప్పలనాయుడు, పల్లా పోలినాయుడు, కర్రి నాయుడుబాబు పాల్గొన్నారు.

అకేషియా కలప లారీలు స్వాధీనం



పట్టుబడిన కలప లారీలు

రావికమతం : ఎటువంటి అనుమతులు లేకుండా రవాణాకు సిద్ధంగా ఉన్న మూడు లారీల అకేషియా కర్రలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం శుక్రవారం పట్టుకున్నారు. తట్టబంద కాటా నుంచి పెద్ద ఎత్తున అకేషియా లోడ్‌లు ఎటువంటి అనుమతులు లేకుండా తరలిపోతున్నట్టు డీఎఫ్‌వో కార్యాలయానికి ఫిర్యాదు అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని, అకేషియా లోడుతో ఉన్న మూడు లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. టేకు, అకేషియా కలప సొంత భూముల్లో నరుక్కున్నప్పటికీ అటవీ శాఖ, రెవెన్యూ అనుమతులు విధిగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

డాక్టర్ రమ్యాదేవికి బంగారు పతకం



గోల్డ్‌మెడల్ సాధించిన డాక్టర్ రమ్యాదేవి

నర్సీపట్నం: వైద్య వృత్తిలో అత్యంత అరుదైన పీజీ రేడియాలజీ రంగంలో నర్సీపట్టణానికి చెందిన డాక్టర్ అల్లు రమ్యాదేవి గోల్డ్‌మెడల్ సాధించారు. మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వారు బంగారు పతకం ప్రదానం చేశారు. ఆ రాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్, విద్యాశాఖ మంత్రి హసన్ ముష్రిఫ్ చేతుల మీదుగా శుక్రవారం ఆమె పతకం అందుకున్నారు. రేడియాలజీ రంగంలో రాణించాలన్న పట్టుదలతో 2020లో జాతీయ నీట్ మెడికల్ పీజీ పరీక్షల్లో 135వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించి రమ్యాదేవి మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఎండీ రేడియాలజీ చేరారు. తనకు ఇష్టమైన రంగంలో గోల్డ్‌మెడల్ సాధించడంతో కష్టానికి ప్రతిఫలం దక్కిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు



విమ్స్‌లో స్థలం పరిశీలిస్తున్న అనురాధ

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కేంద్ర ప్రభుత్వం సెకండరీ లెవెల్ 'కెమికల్ బయోలాజికల్ రేడిలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్)' మెడకల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు వైద్యాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సీనియర్ రీజినల్ డైరెక్టర్ ఎం.అనురాధ ఆధ్వర్యంలో బృందం శుక్రవారం విమ్స్‌ను సందర్శించింది. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, వైద్యులతో కలసి ఈ బృందం సీబీఆర్‌సీ ఏర్పాటు, మౌలిక సదుపాయాల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో 12వ బ్లాక్‌లో నిర్వహిస్తున్న స్పైనల్ రిహేబిలిటేషన్ సెంటర్, బ్లడ్ బ్యాంక్, క్యాజువాలిటీ, వార్డులను పరిశీలించారు. సెంట్రల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యోగేష్, చీఫ్ ఇంజినీర్ కె.రాజీవ్, డిప్యూటీ ఆర్కిటెక్టులు ఇమ్రాన్ ఖాన్, సచిన మహేంద్రలతో జూమ్ మీటింగ్‌లో సంప్రదించారు. కార్యక్రమంలో విమ్స్ ఆర్ఎంవో డాక్టర్ శ్యాంకుమార్, స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ అండ్ వెల్ఫేర్ ఎస్.ఎన్.ఓ డాక్టర్ మోహన్‌కృష్ణ, విమ్స్ పరిపాలనాధికారి డాక్టర్ షేక్ బాజిత్, అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు గౌరీ గ్రంథాలయంలో ఉచిత శిక్షణ



అన్వేష్‌రెడ్డి నుంచి ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణ, వెంకటరమణ



సూర్యనారాయణ, వెంకటరమణకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న అన్వేష్‌రెడ్డి

- ఆన్‌లైన్‌లో శిక్షణ, ఆఫ్‌లైన్‌లో మాక్‌టెస్టులు

అనకాపల్లి : పోటీ పరీక్షలకు స్థానిక గౌరీ గ్రంథాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించేందుకు శ్రీధర్ సీసీఈ గ్రంథాలయంతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సీసీఈ డైరెక్టర్ ఎ.అన్వేష్‌రెడ్డి చెప్పారు. గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఇంట్రాక్టివ్ బోర్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తాజాగా నోటిఫికేషన్లకు శిక్షణ జరుగుతుందన్నారు. శిక్షణలో విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఆన్‌లైన్‌లో సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు శిక్షణ, ప్రతి ఆదివారం ఆఫ్‌లైన్‌లో మాక్‌టెస్టులు జరుగుతాయని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల శిక్షణ పొందలేకపోతున్న గ్రామీణ, పేద విద్యార్థులకు శ్రీధర్ సీసీఈ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ చుక్కానిలా నిలుస్తుందన్నారు. నిరుద్యోగ యువత సంక్షేమం కోసం శ్రీధర్ సీసీఈ ప్రాజెక్టు 24లో భాగంగా అనకాపల్లిలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గత 28 ఏళ్లుగా నిరుద్యోగులకు శిక్షణ ఇస్తూ ఉపాధికి దోహదపడిన సీసీఈ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా శ్రీగౌరీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు స్టడీ మెటీరియల్ పంపిణీతో పాటు (కాలేజ్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్) ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తదితర పోటీ పరీక్షలకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా గ్రంథాలయ అధ్యక్షుడు డి.సూర్యనారాయణ, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు కర్రి గంగాధర్, కె.జగ్గారావు, సభ్యులు బొడ్డేడ జగ్గ అప్పారావు, కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు రూ.1.24 లక్షల వితరణ



ప్రిన్సిపాల్‌కు చెక్కును అందచేస్తున్న పూర్వ విద్యార్థులు

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మాణం కోసం 1974 బ్యాచ్ విద్యార్థులు రూ.1.24 లక్షలు వితరణగా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణను కలసిన పూర్వ విద్యార్థుల బృందం ప్రతినిధులు తమ విరాళం చెక్కును అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల కన్నా విద్యార్థినులే అధిక సంఖ్యలో విద్యార్జన చేస్తున్నారని, వారు వాష్‌రూం కొరకు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను పూర్వ విద్యార్థులు పరిష్కరించడం సంతోషదాయకమన్నారు. పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామ్మూర్తి, డాక్టర్ దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాము ఇటీవలే కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించామని ఆ సమయంలో తాము చదువుకున్న కళాశాలకు ఏదైనా మంచి పని చేయాలని నిర్ణయించామన్నారు. దీంట్లో భాగంగా లేడీస్ టాయిలెట్ల కోసం తామంతా ఆర్థికంగా సహకరించామని, భవిష్యత్‌లో విద్యార్థుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్స్ సదుపాయాలు సమకూర్చనున్నట్టు తెలిపారు. పూర్వ విద్యార్థి బృందానికి ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కృతజ్ఞతాభినందనలు తెలిపింది. కార్యక్రమంలో కళాశాల అల్యూమిన్ని కో ఆర్డినేటర్ జి.నారాయణమూర్తి, సీనియర్ లెక్చరర్లు ఎస్ఎం.రఫీయుద్దీన్, సుధీర్, వి.అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, సూర్యవతి, జ్యోతి, ఐ.వి.వి సత్యవతి, కృష్ణారావు పాల్గొన్నారు.

ముందస్తు స్క్రీనింగ్‌తో మెరుగైన ఆరోగ్యం



బ్రెస్ట్ క్యాన్సర్‌పై డాక్టర్ సుమితా శంకర్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించిన నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తత, అవగాహనతో రక్షణ

విశాఖ సిటీ : రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, అప్రమత్తతతోనే రక్షణ పొందడం సులభమని ప్రముఖ ప్లాస్టిక్, మైక్రోసర్జన్ డాక్టర్ సుమితా శంకర్ పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అధ్యక్షతన రోటరీ క్లబ్, వాల్తేర్ సహకారంతో శుక్రవారం మహిళల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మందికిపైగా పోలీస్ మహిళా అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు ముందస్తు స్క్రీనింగ్ ఆవశ్యకతను వివరించారు. దీన్ని ముందుగా గుర్తించడం ద్వారా 90 శాతం మనుగడ ఉంటుందని తెలిపారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రజినీప్రియ మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ నివారణలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను సూచించారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండడం, తొలి దశలో గుర్తించడం ద్వారా దీన్ని పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. అందుకే రోటరీ క్లబ్ ఆఫ్ వాల్తేర్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సుమితా శంకర్ రచించిన 'కంప్లీట్ గైడ్ టు బ్రెస్ట్ హెల్త్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఈ పుస్తకాన్ని తెలుగులో అనువదించి రాష్ట్రంలో ఉన్న పోలీసులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లెనోరా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం కొబ్బరితోటలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి శనివారం మాఘపౌర్ణమిని పురస్కరించుకుని చందన అలంకరణ, శ్రీలక్ష్మీ ఆండాళ్ అమ్మవారికి పంచామృతాభిషేకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం స్వామివారికి దీపాలంకరణ సేవ జరుగుతుందన్నారు.

26న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వ ర్యంలో జరిగే ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 27 ఏళ్ల లోపు వయస్సు ఉండి ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ 2020- 21,2021-22, 2022-23 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువకులు డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్స్ ట్రైనింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ హెటిరో డ్రగ్స్ సంయుక్తంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఆసక్తి కలగిన యువకులు బయోడేటా, సర్టిఫికెట్స్‌తో 26న కళాశాలకు హాజరు కావాలని సూచించారు.

సిమెంట్ రోడ్డు పునర్నిర్మాణ పనుల ప్రారంభం



రోడ్డు నిర్మాణానికి చదును చేసిన మేదరవీధి- కనక మహాలక్ష్మి రహదారి

కశింకోట : కశింకోటలోని మేదరవీధి నుంచి కనక మహాలక్ష్మి వీధి వైపు సిమెంట్ రోడ్డు పునర్నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సిమెంట్ రోడ్ల నిర్మాణానికి సమకూర్చిన రూ.50 లక్షల నిధుల్లో భాగంగా ఈ రోడ్డు రెండు వైపులా విస్తరించి నిర్మించడానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు రోడ్డు పక్క చెట్లు, ఆక్రమణలు తొలగించి చదును చేస్తున్నారు. అనంతరం సిమెంట్ కాంక్రీట్‌తో సిమెంట్ రోడ్డు వేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 5,540 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,710	4,700
మొదటి రకం	3,600	4,270
రెండో రకం	3,470	3,880
మూడోరకం	3,260	3,460

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
సుందరం మాస్టర్:	సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం :	సత్యనారాయణ స్క్రీన్-2
సిద్ధార్థరాయ్	: షిర్డిసాయి
ఊరు పేరు బైరవకోన	: పర్తిసాయి
వూదో తిరిగి వచ్చింది:	వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-19 యూనిట్లు, బీ పాజిటివ్-29 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

పేదల ఆరోగ్యానికి రక్ష



నూతలగుంటపాలెంలో రోగుల స్పాట్ రిజిస్ట్రేషన్



రోగులను పరీక్షిస్తున్న జనరల్ ఫిజీషియన్ సుష్మ



రోగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి మనీషా

- నూతలగుంటపాలెం జగనన్న సురక్షలో 439 మందికి వైద్య సేవలు
- ఉచితంగా పరీక్షలు చేసి మందులిచ్చిన వైద్య సిబ్బంది
- హర్షం వ్యక్తం చేసిన ప్రజలు



శిబిరానికి హాజరైన వృద్ధులు



కళ్లు పరీక్షిస్తున్న ఆప్తాలమిక్ సంధ్య

కశింకోట : మండలంలోని నూతలగుంటపాలెం సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష ఆదరణ లభించింది. 439 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 79 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 54 మందికి కళ్లద్దాలు, ఇద్దరికి కంటి శస్త్ర చికిత్సలకు సిఫార్స్ చేశారు. నూతలగుంటపాలెంతో పాటు ఏనుగుతుని, శివారు చిన ఏనుగుతుని, అచ్యుతాపురం, త్రిపురవానిపాలెం గ్రామాల నుంచి ఉత్సాహంగా ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు. అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో స్పాట్ రిజిస్ట్రేషన్ చేసి రోగులకు బీపీ, సుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని సాధారణ ఫిజీషియన్ సుష్మ, కీళ్ల వైద్య నిపుణుడు ఎస్. గోపీ, పీహెచ్‌సీ వైద్యాధికారి మనీషా పరీక్షించారు. అవసరమైన వారికి పది రకాల రక్త పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఆప్తాల్మిక్ సంధ్య కళ్ల తనిఖీ చేసి కళ్లద్దాలు, శస్త్ర చికిత్సలకు సిఫార్స్ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి యు. రమేష్ పర్యవేక్షించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎంఎస్‌వి ప్రసాద్ రక్త హీనత నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. జగనన్న పోషకాహార కిట్లను ప్రదర్శించారు. సూపర్ వైజర్ వంశీప్రియ పోషకార అవశ్యకతను శిబిరానికి వచ్చిన గర్భిణులు, మహిళలకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వి. జ్యోతి, కె. అమ్మాజీ, బీఎస్‌వీ సత్యవతి, ఐ. జగదీశ్వరి, ఆర్. కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ యాప్ పట్ల రోగులకు అవగాహన కలిగించారు. ఆరోగ్య సంరక్షణపై ఎల్ఈడీ టీవీలో ప్రత్యేక కార్యక్రమాలు ప్రదర్శించి అవగాహన కలిగించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఈవోఆర్‌డీ సోమరాజు, సర్పంచ్ కలిగెట్ల నూకరత్నం, పార్టీ నాయకులు కలిగెట్ల నాయుడు, నమ్మి గణేష్, కొప్పాక గణేష్, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఆర్‌వీవీ సత్యనారాయణ, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి వృద్ధులు ఎక్కువగా హాజరై వైద్య సేవలు పొందారు.

సీఎంకు కృతజ్ఞతలు..



నీరసంతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్ష చేయించుకుంటే రక్త హీనత ఉందని చెప్పారు. మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్లు సూచించారు. ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– యలమంచిలి వెంకటలక్ష్మి, అచ్యుతాపురం, కశింకోట మండలం

డాక్టర్లు చక్కగా చూశారు..



కొద్ది రోజులుగా జలుబు, దగ్గుతో బాధపడుతున్నాను. తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వ్యాధి తగ్గిపోతుందని, భయం లేదన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది చక్కగా పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.

– కలిగెట్ల హర్షిణి, విద్యార్థిని, 5వ తరగతి, నూతలగుంటపాలెం

ఈ శిబిరాలు పేదలకు ఉపయుక్తం..



చాలా రోజులుగా కాళ్ల నొప్పలతో బాధపడుతున్నాను. తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రత్యేక కీళ్ల వైద్య నిపుణుడు పరీక్షించి మందులు అందజేశారు. తగ్గిపోతుందన్నారు. సంతోషంగా ఉంది. మాలాంటి వారికి జగనన్న ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరం.

– అగ్రహారపు రాము, నూతలగుంటపాలెం

మోకాళ్ల నొప్పలకు చికిత్స చేయించుకున్నాను..



కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రత్యేక వైద్యులు సమగ్రంగా పరీక్షించి మందులు అందించారు. నొప్పులు తగ్గుతాయన్నారు. శిబిరానికి వచ్చిన వారందరినీ ఎంతో చక్కగా చూస్తున్నారు.

– మంతిన రాజు, ఏనుగుతుని గ్రామం

కన్యకాపరమేశ్వరికి విశేష పూజలు



కన్యకాపరమేశ్వరి మూలవిరాట్‌కు పంచామృతాలను అభిషేకిస్తున్న అర్చకులు



ఆలయ మండపంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా అమ్మవారి ఆలయ శత వార్షికోత్సవం

అనకాపల్లి : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అమ్మవారి ఆలయం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తర్వాత ప్రవేశించిన మాఘపౌర్ణమి సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నవకలశ స్నపనం, లక్ష్మీగణపతి హోమం, నీరాజ మంత్రపుష్పాలు అత్యంత వైభవంగా జరిగాయి. గోశాలలో గోపూజ, తెల్లవారు జామున భక్తుల నగరసంకీర్తనతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ గ్రంధి శేషుకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గోపూజ చేస్తున్న భక్తులు



నగర సంకీర్తనలో భక్తులు

నూకాంబిక అమ్మవారి సన్నిధిలో భారతీస్వామి



నూకాంబిక అమ్మవారి ఆలయంలో శ్రీ నిత్యవిద్యానంద భారతీస్వామి

అనకాపల్లి : ఆదిపరాశక్తి ధ్యానంలో కనిపించి తనకు ఆలయం నిర్మించమని అడిగిందని శ్రీ నిత్య విద్యానంద భారతీస్వామి తెలిపారు. స్థానిక నూకాంబిక అమ్మవారిని ఆయన శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరాశక్తి ఆలయ నిర్మాణం చేపట్టే ప్రయత్నంలో పలు దేవాలయాలను పాదయాత్ర ద్వారా సందర్శిస్తున్నట్లు చెప్పారు. నూకాంబిక ఆలయ దర్శనంతో మంచి అనుభూతి కలిగిందన్నారు. ఇక్కడ అమ్మవారి ఆలయం సుందరంగా నిర్మాణం కావడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. అంతకు ముందు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ భారతీస్వామిని అమ్మవారి చిత్రపటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాలల అభివృద్ధికి చేయూతనందించాలి



ప్రిన్సిపాల్ గల్లా జయబాబుకు రూ.64 వేల చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి : ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించిన పూర్వ విద్యార్థులు తమ శక్తి కొద్దీ ఆయా కళాశాలల అభివృద్ధికి తోడ్పడాలని ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు అన్నారు. కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ గల్లా జయబాబుకు విద్యార్థుల భోజన బల్లల కోసం రూ.64 వేల చెక్కును శుక్రవారం పూర్వ విద్యార్థులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థి, ప్రస్తుత జార్జి క్లబ్ కార్యదర్శి బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు సంఘానికి రూ.10 వేలు విరాలంగా అందజేశారని, సంఘం ఆధ్వర్యంలో నిల్వ ఉన్న రూ.54 వేలతో పాటు రూ.10 వేలు మొత్తం 64 వేల చెక్కును విద్యార్థుల కోసం ఉపయోగించాలని కోరారు. కళాశాలల్లో చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి మొల్లేటి జగదీశ్వరరావు, ఉపాధ్యక్షురాలు కోరుబిల్లి లావణ్య, సభ్యులు కె.ఎ.ఎస్. నాయుడు, పెంటకోట అనురాధ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం



నరసింగబిల్లి హైస్కూల్లో టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కశింకోట : మండలంలోని హైస్కూళ్లలో టెన్త్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, బాలికల హైస్కూలుతో పాటు బయ్యవరం, కొత్తపల్లి, జమాదులపాలెం, తాళ్లపాలెం, కన్నూరుపాలెం, ఏఎస్ పేట, నరసింగబిల్లి, తేగాడలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా విద్యాలయం, తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పరీక్షలు ప్రారంభించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలపై అవగాహన, విద్యార్థుల తీరు తెలుసుకోవడం, వారిలో పరీక్ష భయాన్ని పోగొట్టడం కోసం ముందస్తు పరీక్షలు ఎప్పటిలాగే చేపట్టారు. దీనిలో భాగంగా ప్రారంభం రోజు తెలుగు సబ్జెక్టులో పరీక్ష నిర్వహించారు. వచ్చే మార్చి 4 వరకు నిర్ణీత షెడ్యూల్‌ను అనుసరించి పరీక్షలు జరుగుతాయని, మొత్తం ఏడు సబ్జెక్టుల్లో పరీక్షలుంటాయని స్థానిక బాలికల హైస్కూలు హెచ్‌ఎం ఎం.ఎస్. స్వర్ణకుమారి తెలిపారు.

సచివాలయాల్లో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న జెడ్సీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి : జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు అన్ని సచివాలయాల్లో జరుగుతున్నాయని, లబ్ధిదారులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. స్థానిక గవరపాలెం సచివాలయంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పనులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. జోన్ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు మండలంలో పలు ప్రాంతాల్లో సెంటు ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇస్తుందని, రిజిస్ట్రేషన్‌తో సర్వహకులు ఉంటాయని పేర్కొన్నారు. జోన్ పరిధిలో సుమారు 5400 మంది లబ్ధిదారులు ఉండగా, నేటి వరకూ 3 వేల మందికి రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏపీడీ డి.కె.దొర, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుపై ఒకరోజు వర్క్ షాప్



ఆధార్ సేవలపై అవగాహన కలిగిస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి

తుమ్మపాల : గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు, మార్పుల సేవలను పూర్తిస్థాయిలో అందించాలని జిల్లా సచివాలయాల అధికారి ఎస్. మంజులవాణి ఆదేశించారు. పట్టణంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామ, వార్డు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, డాటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు ఆధార్ నమోదుపై ఒక్కరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ మూలమని, దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాల్లోనే ఆధార్ కేంద్రాలు నెలకొల్పిందన్నారు. జన్మించిన ప్రతి బిడ్డకు ఆధార్ నమోదు చేయాలని, తప్పులుంటే సరి చేయాలని సూచించారు. ప్రజలకు నిజాయతీగా సేవలందించి వారి మన్ననలు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆధార్ నమోదు, తప్పులు సరిచేయడంపై సచివాలయం సిబ్బందికి అవగాహన కల్పించారు. సందేహాలను స్టేట్ కోఆర్డినేటర్ వి.సుందరం, సహాయ సంచాలకుడు బి. బాలుప్రసాద్ నివృత్తి చేశారు. నర్సీపట్నం డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం.ఉదయశ్రీ, ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌కుమార్, జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎం సునీత, జిల్లా ఆధార్ కోఆర్డినేటర్ వి.వి.ఆర్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ప్రత్యేక గౌరవం



వలంటీర్లను సత్కరిస్తున్న దిలీప్‌కుమార్

అనకాపల్లి : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు ప్రత్యేక గౌరవం ఇస్తున్నారని ఏపీడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలో తుమ్మపాల సచివాలయ పరిధిలో ఐదుగురు వలంటీర్లను సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవలో చెరగని ముద్ర వేసుకున్న వలంటీర్లను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకూ పోరాటం



నెహ్రూచౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

అనకాపల్లి : రైతాంగ ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగించి యువ రైతు మరణానికి కారణమైన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకూ పోరాటాలు చేస్తామని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీ రైతు సంఘాల నేతలు స్పష్టం చేశారు. నెహ్రూచౌక్‌లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతుల పొట్ట కొట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను తీసుకురావడం అన్యాయమన్నారు. రైతాంగానికి నష్టం కలిగించే మూడు నల్లచట్టాలను రద్దు చేసే వరకూ పోరాటాలు చేస్తామని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, చట్టాలను రద్దు చేస్తామని ఏడాది క్రితం చెప్పిన మాటలను మోదీ తక్షణమే అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామన్నారు. హర్యానాలో రైతు ఉద్యమంపై కాల్పులు జరిపారని, ఈ కాల్పుల్లో యువరైతు శుభకరణ్ సింగ్ మరణించినట్లు వారు పేర్కొన్నారు. రైతాంగ పోరాటాలకు దేశ ప్రజలు మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఆర్.శంకరరావు, కర్రి అప్పారావు, పి.పరమేశ్వరరావు, ఎ.రాజు, భద్రం, కోరుబిల్లి శంకరరావు, రాజాన దొరబాబు, ఎం.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్



కాశీపురం హైస్కూల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ప్రధానోపాధ్యాయురాలు పి.బి.టి. సుందరి ఆధ్వర్యంలో ఫేర్‌వెల్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో-2 వి.ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులంతా ఇష్టపడి చదివి, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాసరి సూర్యనారాయణ, గ్రామ పెద్దలు బండారు దేముడునాయుడు, ఆదిరెడ్డి సింహాచలంనాయుడు, ఆదిరెడ్డి చినకన్నబాబు, ఉపాధ్యాయులు సుజాత, రామలక్ష్మి, కొట్టాన రాంబాబు, పూర్ణిమ, సత్యవతి, సూర్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత తీర్థం



సంతోషిమాత ఆలయం వద్ద మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయం వద్ద వార్షిక తీర్థమహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అమ్మవారిని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనతో పాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు అమ్మవారి చిత్రపటాలను అందజేసి, సత్కరించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ కె.జె.పురం ప్రధాన కూడలి ఆధ్యాత్మికతకు వేదికగా మారిందని, ఇక్కడ ఆలయాలల్లో పూజలు, ఆలయంలో నిత్యాన్నదానం నిర్వహించడం సంతోషకరమన్నారు. తీర్థం సందర్భంగా ముగ్గులు, కబడ్డీ, సైకిల్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

274 మంది విద్యార్థినులకు అట్టల పంపిణీ



విద్యార్థినులకు అట్టలు అందిస్తున్న రామారావు, ప్రిన్సిపాల్ చిన్నమ్మలు

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు మంచి చదువులు చదవడం ఒక్కటే మార్గమని ఎ.కోడూరుకు చెందిన దొగ్గ మల్లమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామారావు అన్నారు. మండలంలోని కింతాడలో గల కేజీబీవీలో విద్యార్థినులకు ట్రస్ట్ ద్వారా పరీక్ష అట్టలను సమకూర్చారు. పాఠశాలలో 6 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకూ చదువుతున్న 274 మందికి పంపిణీ చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన



సీతారాముల విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని తామరంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.